క్లుప్తంగా

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

అంబర్‌పేట: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈరోజు నుంచి ప్రారంభమయ్యే పరీక్షలకు అధికారులు సన్నాహాలు చేశారు. అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ప్రైవేటు, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన మొత్తం 5006 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు డిప్యూటీ డీఈఓ విజయలక్ష్మి ప్రకటించారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లను చేసినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని డీఈఓ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలని సూచించారు.

ఆర్యవైశ్య మహాసభజిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్ గుప్తా

కాచిగూడ: హైదరాబాద్ జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడిగా సరబు లక్ష్మణ్ గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కాచిగూడ వైశ్య హాస్టల్‌లో జరిగిన మహాసభ సర్వసభ్య సమావేశంలో ఆయనకు నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి లక్ష్మయ్య గుప్తా అందజేశారు. ప్రధానకార్యదర్శిగా కటకం శివకుమార్, కోశాధికారిగా లింగ ప్రకాష్, అదనపు ప్రధానకార్యదర్శిగా కోకొల్ల సత్యం గుప్తా, ఉపాధ్యక్షుడిగా రేపాక వెంకటేశ్వర్లు, పీఆర్‌ఓగా శ్రీనివాస్ గుప్తా, సహాయ కోశాధికారిగా చింతలఫట్ శ్రీరామ్, వాసవి సేవాదల్ అధ్యక్షుడిగా కూన వెంకట గోపాలకృష్ణ, మహిళా విభాగ్ అధ్యక్షురాలిగా కొమిరిశెట్టి స్వర్ణలతలను ఈ సందర్భంగా అధ్యక్షుడు సరబు లక్ష్మణ్ గుప్తా ప్రకటించారు. ఎమ్మెల్సీ బోగారం దయానంద్ గుప్తా, వేలూరు రవీంద్రనాథ్ , మ్యాడం దయాకర్, చంద్రశేఖర్‌రావు, అల్లాడి నాగభూషణం, కాశెట్ట పాండు, కసనగొట్టు రాజశేఖర్, కొండ్లె మల్లికార్జున్, జయరాములు తదితరులు ప్రసంగించారు. హైదరాబాద్ జిల్లాలోని 36 బస్తీ సంఘాల ప్రతినిధులు 300 మందికి పైగా పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ తెగల ప్రగతి సంఘం అధ్యక్షుడిగా అనంత్‌రాజ్

కాచిగూడ: షెడ్యూల్ కులాల, తెగల ప్రగతి సంఘం సమావేశం కాచిగూడ చెప్పల్‌బజార్‌లో ఆదివారం రాత్రి జరిగింది. అధ్యక్షులుగా కె.అనంతరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.సూర్యారావు (బబ్బి), ప్రధానకార్యదర్శిగా ఎస్.మహేష్, జాయింట్ సెక్రటరీగా ఎల్.శ్రీనాథ్, ట్రెజరర్‌గా ఆర్.కిరణ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వీరిని సంఘం సభ్యులు ఘనంగా సత్కరించి అభినందించారు.

'మాల, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలి'

కవాడిగూడ: సీఎం కేసీఆర్ మాల, మాదిగ, ఉపకులాల అభివృద్ధి కోసం ఎక్కడా లేని విధంగా దళిత బంధు పథకం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టి భవిష్యత్ తరాలకు ఆదర్శమూర్తిగా నిలిచారని టీఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజుమాదిగ, తెలంగాణ మాది హక్కుల దండోరా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జన్ను కనకరాజులు కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రతి ఏడాది నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేసేందుకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మాల, మాదిగ, ఉపకులాలలో ఎవరికైనా ఒకసారి మాత్రమే ఉత్సవ కమిటీ చైర్మన్, పదవిని కేటాయిస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ ఏకపక్షంగా 2011లో చైర్మన్ పదవి చేపట్టిన మేడిపాపయ్యకు రెండోసారి 2023 ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పదవి ప్రకటించడం నిబంధనలకు విరుద్ధమని వారు తీవ్రస్థాయిలో ఖండించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని మంత్రి ఉపసంహరించుకోకపోతే మంత్రి ఇంటిని ఈనెల 5న ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల, మాదిగ, ఉప కులాల ఫ్రంట్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ పదవి నుంచి మేడిపాపయ్యను తొలగించాలని డిమాండ్ చేస్తూ.. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బీ.ఎస్.రమేష్‌కుమార్‌మాదిగ, ఎం.మహేష్, భైంటీ సేన ఫౌండర్ బల్వంత్‌రావు, ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు చింతల రాజలింగం, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు చెరుకు రాంచందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ – ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (55) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపై తెలుపు, గోధుమ రంగు చెక్స్‌గల చొక్కా, నీలిరంగు ప్యాంటు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సీఎం కేసీఆర్ మనసున్న మారాజు'

○ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని ప్రశంస ○ అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ గైర్హాజరు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్ఎస్ పార్టీ అడిక్‌మెట్ డివిజన్ ఆత్మీయ సమ్మేళనం అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్‌లో జరిగింది. ఆదివారం జరిగిన ఈ సమ్మేళనానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ' సీఎం కేసీఆర్ మనసున్న మారాజు అని.. పేద ప్రజలు ఏమి అడగకుండానే కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్లు, కంటి వెలుగు, ఆసరా ఫించన్లు, దళితబంధు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిన దార్శనికుడని' కొనియాడారు. బస్తీలు, కాలనీల్లో ఏ సమస్య ఉన్నా బీఆర్ఎస్ కార్యకర్త దగ్గరికే వెళ్తున్నారన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తొలిసారిగా 1.30 లక్షల ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని తెలిపారు. 'సికింద్రాబాద్ ఎంపీగా గెలిచిన వారు గత నాలుగేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేదని మంత్రి తలసాని విమర్శించారు'. బీజేపీ నేతలు అబద్ధాలపై రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడిన తరువాత బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. దాసోజు శ్రవణ్‌కుమార్, ట్రేడ్ యూనియన్ నాయకులు రాంబాబు, తలసాని సాయికిరణ్‌యాదవ్, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, ముఠా పద్మ, సుధాకర్‌గుప్తా తదితరులతో పాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం అడిక్‌మెట్ డివిజన్‌లో ఉత్సాహంగా జరిగింది. నగరం నుంచి ట్రేడ్ యూనియన్ నాయకులు నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, హాజరై సమ్మేళనానికి కొత్త ఊపును తీసుకొచ్చారు. ఇటీవల కవాడిగూడ డివిజన్‌లో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో జరిగిన పొరపాట్లను జరగనివ్వకుండా పార్టీ నాయకులు, డివిజన్ నాయకత్వం జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా అడిక్‌మెట్ డివిజన్‌లో ఫ్లెక్సీలు, గులాబీ తోరణాలతో నింపారు. మంత్రి తలసాని మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో తనకున్న అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సీనియర్ నాయకులు రామారావు, మనోహర్‌సింగ్, ముఠా పద్మ, మాధవ్, శ్యామ్‌సుందర్, డివిజన్ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ జహంగీర్, సుధాకర్‌గుప్తా, నేత శ్రీనివాస్, మల్లికార్జున్‌రెడ్డి, సయ్యద్ అస్లాం, ఆర్.మోజెస్ తదితరులున్నారు.

కార్పొరేటర్ గైర్హాజరుపై..

◆ అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతా ప్రకాష్‌గౌడ్ వ్యవహార శైలి చర్చనీయంశంగా మారింది. బీజేపీకి రాజీనామా చేసి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి ఏడాది దాటినా.. ఇప్పటి వరకు అధికారికంగా బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో ఆమె పాల్గొనకపోవడం పార్టీలో చర్చకు దారితీస్తోంది. మాజీ కార్పొరేటర్ల మధ్య విబేధాలు సద్దుమనిగి ఇక ఆత్మీయ సమ్మేళనానికి వస్తుంనుకున్న కార్పొరేటర్ తిరిగి గైహాజరు కావడం గమనార్హం. ముందస్తు సమాచారం ఉన్నప్పటికి ఆత్మీయ సమ్మేళనానికి ఆహ్వానించినా హాజరు కాకపోవడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకింత అసహనానికి గురయ్యారు.

మహవీర్ కల్యాణ మహోత్సవం



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: 'అజిత్ ప్రాష్య యువ సంఘటన్' ఆధ్వర్యంలో జైన్ మందిర్‌లో జరిగిన 2622వ భగవాన్ మహావీర్ జన్మ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జైన మతాన్ని పునరుద్ధరించిన 24వ తీర్థంకరుడు మహావీర్ అని ఆయనను వర్ధమాన్‌గా కూడా కొలుస్తారన్నారు. ఆధ్యాత్మిక విముక్తి, అహింసా, సత్యం, పవిత్రత పాటించడంతో పాటు చౌర్యం చేయకూడదనే అనేక ధర్మ సూత్రాలను మహావీరుడు ప్రజలకు బోధించారన్నారు. వాటిని మనమందరం పాటించాలని ఆయన సూచించారు.

విద్యార్థులు దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని భాస్యం మోడల్ హైస్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ శోభారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాఠశాల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే మంచి అలవాట్లు నేర్పించాల్సిన అవసరం ఉందని దీనికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కీలక పాత్ర పోషించాలని సూచించారు. క్రమశిక్షణ కలిగిన విద్య ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు తోడ్పడుతుందన్నారు. అంబర్‌పేట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, విద్యావేత్త శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శ



బాల్‌రాజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

అంబర్‌పేట: బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావును హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పరామర్శించారు. ఇటీవల గౌతమ్‌రావు తల్లి శారదదేవి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఓదార్చారు. బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, నాయకులు అజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, నాగరాజ్ తదితరులున్నారు.

బాలరాజు మృతి తీరని లోటు..

◆ అంబర్‌పేటకు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనెం బాల్‌రాజ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గవర్నర్ అంబర్‌పేటలోని ఆయన నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాల్‌రాజ్ 40 ఏళ్లుగా పార్టీలో పని చేసిన తీరు తనకు స్వయంగా తెలుసునని ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేసుకున్నారు. బాల్‌రాజ్ వంటి క్రియాశీల నాయకుడు మృతి చెందడం పార్టీకి తీరని లోటన్నారు. బీజేపీ నాయకులు నాగభూషణం చారి, ఆనంద్‌గౌడ్, బ్రహ్మచారి తదితరులున్నారు.

బీజేఆర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసి దళితులపై తమ చిత్త శుద్ధిని చాటుకోవాలని తెలంగాణ మాదిగ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గారె వెంకటేష్‌మాదిగ డిమాండ్ చేశారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం పక్కనే జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని మాదిగ పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలోని అంటరాని వారి బ్రతుకుల విముక్తి కోసం పోరాడి విద్య, ఉద్యోగ, రాజకీయ ఎదుగుదలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టి రాజ్యాంగంలో పొందుపరిస్తే బాబు జగ్జీవన్‌రామ్ ఆట్టి రిజర్వేషన్‌లను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. మహనీయుల జయంతి, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర రాంచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాములు, మీడియా అధ్యక్షులు నర్సింగ్‌రావు, మహిళా కో- ఆర్డినేటర్ రోషిణి విజయలక్ష్మి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నర్సింగ్, ప్రధాన కార్యదర్శి అంజి తదితరులున్నారు.

యూహెచ్‌ఆర్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



నల్లకుంట: యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (యూహెచ్‌ఆర్‌ఓ) హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నల్లకుంటకు చెందిన పాట శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు యూహెచ్‌ఆర్‌ఓ జాతీయ అధ్యక్షుడు ఆరుట్ల అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి బైకన్ల చేతుల మీదుగా శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన యూహెచ్‌ఆర్‌ఓ జాతీయ కమిటీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కాచిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా 12,769 పంచాయతీలలో వివిధ కేటగిరీలలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలంగాణ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నారాయణగూడలోని ఏఐటీయూసీ భవన్‌లో వెంకటరాజ్యం అధ్యక్షతన తెలంగాణ గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ అడ్వైజర్ ఎం.డీ. యూసుఫ్, జేఏసీ చైర్మన్ పాలడుగు భాస్కర్, జేఏసీ సెక్రటరీ జనరల్ యజ్ఞ నారాయణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. జీవో నెంబర్ 60 ప్రకారం కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 22,750 వేతనంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటును కేటాయించాలన్నారు. ఆ గ్రాంటు నుంచే వేతనాలను చెల్లించాలన్నారు. 2011 జనాభా ప్రాతిపదికన కాకుండా 2021 జనాభా ప్రాతిపదికన కార్మికులను పరిగణించాలని ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలన్నారు. జీవోనెంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పాలడుగు సుధాకర్, వెంకన్న, దాసు, నరసింహారెడ్డి, ఆర్కే నాయుడు, మల్లయ్య తదితరులున్నారు.

ఒకేసారి బార్ అసోసియేషన్ ఎన్నికలు



కవాడిగూడ: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని (బార్ అసోసియేషన్) న్యాయవాద సంఘాల ఎన్నికలను రాష్ట్రం మొత్తం ఒకేసారి నిర్వహించడం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్స్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం కవాడిగూడలోని అడ్వకేట్ జేఏసీ కార్యాయంలో ఆయన మాట్లాడారు. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన కార్యవర్గ సభ్యులందరికీ ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు.

'నిజమైన అంబేడ్కర్ వాది సీఎం కేసీఆర్'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ముందుకు తీసుకెళ్తున్న నిజమైన అంబేడ్కర్ వాది సీఎం కేసీఆర్ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే తెలంగాణ రాష్ట్ర ఏర్పడిందని భావిస్తున్న సీఎం కేసిఆర్ అసెంబ్లీలో చెప్పడమే కాకుండా దళితుల సంక్షేమాన్ని ఆచరణలో పెడుతున్నారని కొనియాడారు. రాష్ట్ర సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు ప్రపంచంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. వర్గీకరణ ఉద్యమంలో 25 ఏళ్ల కీలక పాత్ర పోషిస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మేడి పాపయ్యను జయంతి ఉత్సవ వర్కింగ్ చైర్మన్‌గా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. 14న నిర్వహించబోయే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ ఉత్సవ కమిటీలతో ఇదే కమిటీ భాగస్వామ్యం చేయాలని కోరారు. బేడ, బుడగ జంగాల జేఏసీ చైర్మన్ హనుమంతు, సువర్ణబాబు, చిన్నబాబు, బంగారు శ్రీను, యాదగిరి, కృష్ణ, ఎల్లన్న, జ్యోతి, తిరుమల్లేష్ తదితరులున్నారు.

ఆదిత్య హృదయ హోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ ప్రథమవార్షికోత్సవాల్లో భాగంగా ఆదిత్య హృదయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం స్థాపిత దేవతాహోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కుమారి నాగ కనిష్క నిర్వహించిన భాగవద్గీతాలాపన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

కవాడిగూడ: కవాడిగూడలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాధవ్ ఆటిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటిజం అవెర్నస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆటిజం అవెర్నస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటిజంపై ప్రజలు పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ నీరజ్ అగర్వాల్, రాజేష్, నూరజ్‌సింగ్, డాక్టర్ ప్రణీత్‌శ్యామల, మాధవ్ ఆటిజం ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ సుమన్‌సరఫ్, ఉపాధ్యక్షులు సునీల్‌సరఫ్, కార్యదర్శి దిలీప్ అన్సారీ, సంయుక్త కార్యదర్శి రూపాలిసా, కోశాధికారి సుష్మా అగర్వాల్ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ఉద్యమం చేసి అమరులైన వారి మరణాలు ప్రభుత్వానికి గుర్తుకు రావడం లేదని మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ, నామినేటెడ్ పోస్టుల్లో కూడా మాదిగలకు తగిన అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాదిగలను విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో మాదిగలు బీఆర్ఎస్ పార్టీని కూడా విస్మరిస్తారని హెచ్చరించారు. తెలంగాణలో మాదిగ ఉపకులాలతో పాటు 18 శాతం ఉన్న వీరిని అణచివేస్తున్నారని ఆరోపించారు. ట్యాంక్‌బండ్‌పైన టి.ఎస్.సదాలక్ష్మి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని 150 అడుగుల బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని, లిడ్‌క్యాప్ కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాచిగూడ: బీజేపీ బలోపేతానికి ప్రజాదరణ కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ మహిళా మోర్చా ఒడిస్సా రాష్ట్ర అధ్యక్షురాలు స్మృతి పట్నాయక్ అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్మృతి పట్నాయక్‌ను పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, మహిళా కార్పొరేటర్లు, పార్టీ మహిళా ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన ప్రజలు లబ్ధి పొందేలా చూడాలన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు జ్యోతి, నీరజ, మాధవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

'అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్'



బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌తో బీజేపీ నేతలు

ముషీరాబాద్: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్‌ను ప్రకటించి ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని బీజేపీ రాజ్యసభ ఎంపీ డా. కె.లక్ష్మణ్ అన్నారు. అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు గడిచినా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లు వేయలేదని వేసినా.. కాలయాపనకే సరిపోయిందని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడి కేసులో జైలుకు వెళ్లొచ్చిన యువమోర్చా నాయకులు భానుప్రకాష్ మద్దూరి శివాజీ, రాజునేత, పవన్‌రెడ్డి తదితరులతో ఆదివారం డాక్టర్ కె.లక్ష్మణ్ ఆశోక్‌నగర్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బండి సంజయ్ నేతృత్వంలో విరోచిత పోరాటం చేస్తుంటే అణచివేతలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. తల్లిదండ్రులు కష్టపడి సంపాదించిన ఆస్తులు అమ్ముకుని తమ 'పిల్లలను ఉద్యోగాల సాధన కోసం కోచింగ్ కోసం డబ్బులు వెచ్చిస్తుంటే ప్రశ్న పత్రాలను అమ్ముకుని వారి ఆశలను ఆవిరి చేయడం ఎంత వరకు సమంజసమని' ఆయన ప్రశ్నించారు.

మహిళలతో సహా ప్రజల ఆకాంక్ష..

చిక్కడపల్లి: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని మహిళలతో సహా ప్రజలందరిలో ఆకాంక్ష పెరిగిందని బీజేపీ పార్లమెంటీ బోర్డు సభ్యులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు విసిగిపోయన ప్రజలు బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు.

◆ తమిళనాడు రాష్ట్ర మహిళామోర్చా ఉపాధ్యక్షురాలు సంగీత మతివనన్ ఆదివారం చిక్కడపల్లిలో ముషీరాబాద్ నియోజవర్గం మహిళామోర్చా బూత్ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర సీనియర్ నాయకురాలు మంగళ, మహంకాళి జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు లక్ష్మీపద్మజ, ప్రఫుల్‌పద్మజారెడ్డి, రమాదేవి, అనిత, డాక్టర్ పద్మజారెడ్డి, మాధురి, కార్పొరేటర్లు పావనీవినయ్‌కుమార్, రచనశ్రీ, అనుష, లక్ష్మి దిలారీ, గౌరీ, జాజులు, రమేష్‌రామ్, బద్రినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి



వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎం.వీ.రమణ



బర్కత్‌పురలో నివాళులర్పిస్తున్న జోర్రిగల శ్రీధర్



చిక్కడపల్లిలో సమన్వయ కమిటీ కార్యాలయంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న 313వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వీ.రమణ మాట్లాడుతూ.. నేడు అధికారం సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమ జీవుల రాజ్యాన్ని సాధించడమే పాపన్నకు నిజమైన నివాళి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించుకోవడంతో పాటు మత సామరస్యం పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజాస్వామిక పరిరక్షణకు పాపన్నను స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమించాలన్నారు. సర్వాయి పాపన్న గ్రామ దేవతలను ఆరాధించిన గొప్ప నాయకుడని కొనియాడారు. భూపతివెంకటేశ్వర్లు, గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వెంకన్నగౌడ్, సుధాకర్, మౌనిక, శ్రీలత తదితరులున్నారు.

సర్వమత రక్షకుడు పాపన్న..

కాచిగూడ: సర్దార్ సర్వాయి పాపన్న త్యాగధనుడు, అభిమానధనుడని బీసీ ప్రజా సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జోర్రిగల శ్రీధర్ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతి సందర్భంగా ఆదివారం బర్కత్‌పుర చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వమత రక్షకుడిగా పాపన్న తన కాలంలో పనిచేశారన్నారు. లండన్ మ్యూజియంలో పాపన్న ప్రతిమ ఉందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పాపన్న చరిత్ర పదిలంగా ఉందని పేర్కొన్నారు. మహేష్, వేణుచారి, సుధాకర్, శ్రీకాంత్, సాయి, బాలేష్, సాయికృష్ణ, నర్సింగ్, శ్రీను, ఎస్సీ, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బహుజనుల ఆశాజ్యోతి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజనుల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌనీ బాలరాజుగౌడ్, కన్వీనర్ వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్‌లు అన్నారు. ఆదివారం చిక్కడపల్లిలో సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో పాపన్నగౌడ్ 313వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రమ జీవుల రాజ్యం సాధించినప్పుడే పాపన్నకు నిజమైన నివాళి అన్నారు. గోల్కొండ కోటను జయించి పరిపాలన సాగించిన ఘనత పాపన్నకే దక్కుతుందన్నారు. పాపన్నగౌడ్ సుపరిపాలన చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎం.వీ.రమణ, సమన్వయ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, బండారి శ్రీనివాస్‌గౌడ్, సారా శ్రీనివాస్‌గౌడ్, మేక నర్సింగ్ రావు, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.